www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 20 అక్టోబర్ 2024
5
పశ్చిమ గోదావరి



ఎడతెరిపిలేని వర్షం


వల్లూరులో రహదారిపై వర్షపు నీరు

ఆచంట: అల్పపీడన ప్రభావంతో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఆచంట, కొడమంచిలి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం తదితర గ్రామాల్లో భారీవర్షం కురిసింది. దీంతో పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలనీలో రోడ్లు ముంపునకు గురై స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే అధ్వానంగా ఉన్న గ్రామీణ రహదారుల పరిస్థితి వర్షానికి మరింత దిగజారింది. కాలనీలో పక్కాడ్రెయిన్ లేకపోవడం, కచ్చా డ్రెయిన్లలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరింది. సుమారు మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది.

కౌలు కార్డులున్నా.. అందని రుణాలు..!

కౌలురైతులకు రుణాల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం

జిల్లా సాగులో 70 శాతం కౌలురైతుల చేతుల్లోనే

ఖరీఫ్ ముగుస్తున్నా అరకొరగానే రుణాల మంజూరు

పశ్చిమలో రూ.102 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.125 కోట్లు

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తేనే కౌలు రైతులకు న్యాయం



ప్రభుత్వాలు మారినా కౌలురైతుల బతుకులు మాత్రం మారలేదు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు ససేమిరా అంటున్నారు. జిల్లా వ్యవసాయంలో అగ్రభాగం కౌలురైతులే సాగు చేస్తున్నా బ్యాంకు రుణాల మంజూరులో మాత్రం అట్టడుగున ఉన్న పరిస్థితి నెలకొంది. దీంతో అందరికీ అన్నంపెట్టే అన్నదాత ఉసూరోమంటూ అప్పల కోసం పరుగులు తీయాల్సిన దుస్థితి కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి కౌలురైతులకు రుణాలందేలా చర్యలు తీసుకుంటేనే అన్నదాతకు మేలు జరిగే పరిస్థితి ఉంటుంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్రంలో అత్యధికంగా కౌలురైతులు ఉన్న జిల్లాలు ఏలూరు, పశ్చిమగోదావరినే. ప్రస్తుత ఖరీఫ్‌లో రెండు జిల్లాల్లో దాదాపు నాలుగున్నర లక్షల్లో వరి సాగు చేయగా అందులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నారు. సాగులో అగ్రభాగంలో ఉన్న కౌలురైతుల పట్ల బ్యాంకర్లు అత్యంత చిన్నచూపు చూస్తున్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు, కౌలురైతులకు బ్యాంకర్లు మంజూరు చేస్తున్న రుణాలకు అసలు పొంతన లేకుండా పోతుంది. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో కౌలురైతులకు ఇచ్చే రుణాలు ఒక్కశాతం కూడా లేని పరిస్థితి. ఖరీఫ్ ముగిసే దశకు చేరుకున్నా రెండు జిల్లాల్లో కౌలురైతులకు బ్యాంకర్లు ఇచ్చిన పంట రుణాల మంజూరు చూస్తే ఎవరైనా నోరెళ్లబెట్టాల్సిందే. 2019కు ముందు టిడిపి ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారం చూస్తే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో కౌలురైతుల సంఖ్యను భారీగా కుదించి సిసిఆర్‌సి (కౌలుకార్డులు) మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిన పరిస్థితి నెలకొంది. వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల పదవీ కాలంలో కౌలురైతుల పరిస్థితి అత్యంత దుర్భరంగా మారింది. కౌలుచట్టంలో సైతం మార్పులు చేసి కౌలురైతులను నిలువునా దెబ్బతీశారు. కూటమి ప్రభుత్వం రావడంతో తమకు న్యాయం జరుగుతుందని కౌలురైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కౌలుచట్టంలో మార్పులు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. వచ్చే రబీ నుంచి కొత్త కౌలు చట్టం ప్రకారం కౌలుకార్డుల జారీ ప్రక్రియ జరుగుతుందని తెలిపింది. అక్కడ వరకూ బాగానే ఉంది. ప్రస్తుత ఖరీఫ్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 89 వేల మందికి, ఏలూరు జిల్లాలో 65 వేల మందికి కౌలుకార్డులు జారీ చేశారు. కార్డులిచ్చిన రైతులకైనా రుణాలు మంజూరు చేశారా అంటే అదీ లేకుండాపోయింది.

పంట రుణాల మంజూరులో ఇంత నిర్లక్ష్యమా..

కౌలుకార్డులు అందుకున్న రైతులకు సైతం బ్యాంకర్లు పంటరుణాలు ఇవ్వని దుస్థితి నెలకొంది. ప్రస్తుత ఖరీఫ్ ముగింపు దశకు చేరుకుంది. కౌలురైతులకు బ్యాంకర్లు మంజూరు చేసిన రుణాలు చూస్తే ఆశ్చర్యపోక తప్పదు. పశ్చిమగోదావరి జిల్లాలో 89 వేల మంది కౌలురైతులకు కౌలుకార్డులు ఇచ్చినట్లు లెక్కలు చెబుతుండగా ఇందులో దాదాపు 12 వేల మందికి రూ.102 కోట్లు మాత్రమే పంట రుణాలు మంజూరయ్యాయి. ఏలూరు జిల్లాలో 64,686 మందికి కౌలుకార్డులు మంజూరు చేయగా ఇప్పటి వరకూ 20,135 మందికి రూ.125.31 కోట్లు మాత్రమే పంటరుణాలు మంజూరు చేసిన పరిస్థితి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళిక రూ.7,300 కోట్లు వరకూ ఉంది. కొద్దిరోజుల క్రితం జిల్లాకు చెందిన మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ వ్యవసాయ రుణ ప్రణాళికలో కౌలురైతులకు రూ.రెండు వేల కోట్లు పంట రుణాలుగా మంజూరు చేయాలని బ్యాంకర్లకు తెలిపారు. ఆయన చెప్పిన దానికి, బ్యాంకర్లు మంజూరు చేసిన పంట రుణాలకు అసలు పొంతనే లేకుండాపోయింది. వ్యవసాయ సాగులో అష్టకష్టాలు పడుతూ అందరికీ అన్నం పెడుతున్న కౌతురైతుల పట్ల బ్యాంకర్లు ఎందుకు చిన్నచూపు చూస్తున్నారో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. కౌలురైతులకు రుణాల మంజూరుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప అన్నదాతకు న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు. అవసరమైతే ప్రభుత్వమే కౌలురైతులకు గ్యారెంటీ ఇచ్చి రుణాలు అందించేవిధంగా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా బ్యాంకర్లు తీరు మారకపోతే అన్నదాత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు.

విద్యుత్ ఛార్జీలు పెంచొద్దు

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనలు


తాడేపల్లిగూడెంలో ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు


ఆకివీడులో..

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం టౌన్

ఇంధనం సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపొద్దని, విద్యుత్ భారాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును విరమించుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జయలక్ష్మీ థియేటర్ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన శనివారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఎఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో మరోసారి రాష్ట్ర ప్రజలపై భారాలు మోపాలని చూస్తుందన్నారు. సుమారు 20 ఏళ్ల క్రితమే విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు పెద్దఎత్తున ఉద్యమించిన విషయాన్ని గుర్తు చేశారు. ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపిన వైసిపికి గత ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. తాజాగా ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.8114 కోట్లు మేర భారం వేయడానికి సిద్ధం కావడం దారుణమన్నారు. నాయకులు కరెడ్ల రామకృష్ణ, సిరపరపు రంగారావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, సత్తి కోదండరామిరెడ్డి, కరక వెంకటరావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, పెనుగంటి దుర్గ, నరమాల కృష్ణ, నాగిరెడ్డి సాయి, మేట్రేడ్డి రమణ, పోతు శ్రీను, తేతలి నాగిరెడ్డి, జవ్వాది శివ తదితరులు పాల్గొన్నారు.

పోడూరు: విద్యుత్ భారాలను తక్షణం ఆపాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎఇకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడగా నేతలు కాకర వెంకటేశ్వర్లు, బురాబత్తుల వెంకట్రావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు: ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం సరికాదని సిపిఎం మండల కార్యదర్శి కె.తవిటినాయుడు విమర్శించారు. విద్యుత్ భారాలను నిరసిస్తూ శనివారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెంకి అప్పారావు, బివి.వర్మ, షేక్ వలీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుమంట్ర: విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన శనివారం బ్రాహ్మణచెర్వు సివిల్ సప్లయిస్ గొడౌన్ వద్ద ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె.సుబ్బరాజు మాట్లాడగా నేతలు కెఎస్.ప్రసాద్, జి.ఆంజనేయులు, కె.చిన్నవెంకటేశులు, కె.పరమేష్, బి.ఏడుకొండలు పాల్గొన్నారు.

పేకాట క్లబ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఐజి అశోక్‌కుమార్


మాట్లాడుతున్న ఐజి జివిజి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి - నరసాపురం

ఉమ్మడి గోదావరి జిల్లాల్లో పేకాట క్లబ్‌లను అనుమతించేది లేదని, ఎక్కడైనా అనధికారికంగా నిర్వహిస్తుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలిచ్చామని ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్ చెప్పారు. శనివారం నరసాపురం డిఎస్‌పి కార్యాలయాన్ని, రూరల్ పోలీసుస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డివిజన్‌లోని ఎస్‌ఐలు, సిఐలతో శాంతిభద్రతలపై సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్ తర్వాత జిల్లాలో నక్సలైట్ల కదలికలపై నిఘా ఉంచామన్నారు. అయితే ఏలూరు ఏజెన్సీ ప్రాంతంలో కొంతమంది నక్సలైట్ల సానుభూతిపరులు తలదాల్చుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర పోలీసులు ఈ ప్రాంతాల్లో కొంతమంది సానుభూతిపరులను అరెస్టు చేసి తీసుకెళ్లారన్నారు. రెండు జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాది క్రైమ్ రేట్ పెరిగిందన్నారు. దీన్ని నియంత్రించేందుకు కఠినంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. సైబర్ నేరాల కట్టడికి తగిన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సైబర్ నేరం జరిగిన మూడు గంటల్లోపు పోలీసును ఆశ్రయించాలన్నారు. బాధితులు వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలు, గల్ఫ్ మోసాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయి విక్రయాలను పూర్తిగా నియంత్రించాలనే లక్ష్యంతో రవాణా, విక్రయదారుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, అడిషనల్ ఎస్‌పిలు భీమారావు, మురళీకృష్ణ, సిఐ యాదగిరి, ఎస్‌ఐలు ముత్యాలరావు, జయలక్ష్మి, వెంకట సురేష్ పాల్గొన్నారు

సాంకేతిక ఇబ్బందులు అధిగమించేందుకు కృషి

ఉచిత ఇసుక బుకింగ్‌పై జిల్లా కలెక్టర్ నాగరాణి


మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఉచిత ఇసుక పొందడానికి సాంకేతిక ఇబ్బందులను అధిగమించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి టెక్నికల్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం తన ఛాంబర్‌లో జిల్లా కాల్ సెంటర్ టెక్నికల్ సిబ్బందితో ఆమె సమావేశమై ఉచిత ఇసుక సాంకేతిక సమస్యలపై సమీక్షించి మాట్లాడారు. వినియోగదారుని అవసరాలకు ఉచిత ఇసుకను తక్కువ రవాణా ఛార్జీలతో అందజేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. కాల్ సెంటర్‌కు వచ్చిన కాల్స్‌ను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సాంకేతిక లోపాలు ఏమైనా ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. దీనిపై రాష్ట్రస్థాయి టెక్నికల్ టీమ్‌తో సంప్రదించి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఉచిత ఇసుక అవసరమైన లబ్ధిదారులు వెబ్‌సైట్‌లో స్వయంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. కొంతమంది మధ్యవర్తులు, మీ సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ బుకింగ్ పేరిట పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి ఫిర్యాదులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, గనులు, భూగర్భ శాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి కె.వెంకటేశ్వర్లు, ఇ-డిస్ట్రిక్ట్ మేనేజర్ మేక కిరణ్ కుమార్, కాల్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీమా ప్రయోజనాలను పొందండి

ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోని కుటుంబానికి రక్షణగా నిలవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు ప్రతి కుటుంబానికీ భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు జన సురక్ష పథకాలను భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా 2015లో ప్రారంభించడం జరిగిందన్నారు. బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకాలలో చేరేందుకు అర్హులేనని తెలిపారు. ఇందుకోసం బ్యాంక్ అకౌంట్‌ను ఆధార్‌తో అనుసంధానించాల్సి ఉంటుందన్నారు. సంబంధిత బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ నకు వెళ్లి సంబంధిత దరఖాస్తును పూరించి పథకాలలో చేరాల్సి ఉంటుందన్నారు. http//www.jansurakha.gov.in వెబ్‌సైట్‌లో అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. కుటుంబంలో సభ్యులందరూ ఈ పథకాలలో చేరవచ్చునని, ఆదాయ పరిమితి లేదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ రెండు పథకాలకు అర్హులేనని తెలిపారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పిఎంజెజెబివై) పథకంలో చేరే వారు సంవత్సరానికి రూ.436 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇది సాధారణ మరణానికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకంలో చేరేందుకు 18 ఏళ్ల నుండి 50 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజనలో రూ.20లు నామమాత్రపు ప్రీమియం చెల్లించి కొనసాగవచ్చన్నారు. పిఎంఎస్‌బివై పాలసీ తీసుకున్న వ్యక్తి ప్రమాదవశాత్తూ మరణిస్తే ఈ పథకం నిబంధనల మేరకు వర్తిస్తుందన్నారు. 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వ్యక్తి పిఎంఎస్‌బివై పథకంలో చేరవచ్చన్నారు.

పండుగలు.. భారాలు..!



వరుస పండుగలు జరుగుతున్నాయి. దసరా పూర్తయ్యింది. దీపావళి రానుంది. అయితే భారాల బాదుడుకు ముగింపు కార్డు పడడం లేదు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటి జనం సతమతమవుతుండగా కూరగాయల ధరలు కొండెక్కాయి. ఈ ధరల నుంచి ప్రభుత్వం ఉపశమనం కల్పిస్తుందని ఆశించినా నిరాశే మిగిలింది. ఉల్లి, టమోటా, బియ్యం, నూనె వంటివి రైతు బజార్లలో అందుబాటులోకి తెచ్చినా అవి పట్టణ ప్రాంతాలకే పరిమితం కావడం, క్వాలిటీ లేకపోవడంతో జనానికి ఎటువంటి ఉపయోగమూ లేకుండాపోయింది. పెరిగిన ధరలు పేద, మధ్యతరగతి కుటుంబాల్లో తీవ్ర అలజడి సృష్టిస్తున్నాయి. ఆదాయం పెరగక, ఖర్చులు పెరగడంతో ఏం చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. దీంతో చాలా కుటుంబాలు దసరా పండుగను సాదాసీదాగానే జరుపుకున్నాయి. పిల్లలకు సెలవులు కావడంతో వారికి ప్రత్యేకంగా పిండి వంటలు కూడా చేయలేకపోయామని పలువురు వాపోయిన పరిస్థితి. ఈ క్రమంలోనే దీపావళి పండుగ ఎలా జరుపుకోవాలా అని తల్లడిల్లుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం మరో షాక్ ఇవ్వడానికి సిద్ధమైంది. ట్రూఅప్, ఇంధన ఛార్జీల పేరిట విద్యుత్ భారాలను మోపడానికి రంగం సిద్ధం చేయడంతో జనం ఖంగుతిన్నారు. ఇప్పటికే కరెంటు బిల్లుల భారం భరించలేని విధంగా ఉందని, కూటమి అధికారంలోకొస్తే బిల్లులు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు భారాలు మోపడం ఏంటని జనం ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఇప్పటికే సిపిఎం పెద్దఎత్తున విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు నిర్వహిస్తోంది. దీపావళి బొనాంజాగా విద్యుత్ భారాలు మోపడం కూటమి ప్రభుత్వం ఆపుతుందో లేక షాక్ ఇస్తుందో వేచిచూడాలి.

గ్రామాల్లో కూటమి నేతల్లో పండుగ సందడి నెలకొంది. అదేమిటీ అనుకుంటున్నారా. అవును మద్యం దుకాణాల జాతరతో ఆయా పార్టీల నేతల్లో సందడి నెలకొంది. లైసెన్స్‌లు దక్కించుకున్న వారెవరైనా ఏ దుకాణం ఎక్కడ పెట్టాలి, ఆ దుకాణాలకు అనుబంధంగా గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు వంటివి అమ్మే బడ్డీ దుకాణం ఎవరు పెట్టుకోవాలి, అలాగే చికెన్ పకోడి దుకాణం ఎవరు పెట్టుకోవచ్చు అనేది కూటమి నేతలే నిర్ణయిస్తున్నారు. నిర్ణయం అంటే దీని వెనుక జరిగే తతంగం బహిరంగ రహస్యమే. ఇక మద్యం దుకాణాల్లో వాటాలు, స్థానికేతరులు, అధికార పార్టీ అండదండలు లేనివారైతే ఎంతోకొంత సొమ్ము తీసుకుని లైసెన్స్‌ను కూటమి నేతలకు అప్పగించేస్తున్నారు. ఈ వ్యవహారాల్లో నేరుగా ఎంఎల్‌ఎల కుటుంబీకులే రంగంలోకి దిగి మంతనాలు సాగిస్తున్న పరిస్థితి ఉంది. దీనివల్లే ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ప్రారంభం కాలేదని సమాచారం. చంద్రబాబు హెచ్చరికలను సైతం ఖాతరు చేయని పరిస్థితి క్షేత్రస్థాయిలో కన్పిస్తోంది. ఇక ఇసుక కూడా ఆన్‌లైన్ పేరిట వినియోగదారులకు అందని ద్రాక్షగా మారింది. మొత్తానికి నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడం, ఇసుక దొరకకపోవడం, మద్యం దుకాణాల్లో నేతల జోక్యం కూటమి ప్రభుత్వానికి మాయని మచ్చలుగా మిగలనున్నాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అదే సమయంలో మద్యం దుకాణాల విషయంలో జనసేన, టిడిపి నేతల మధ్య తీవ్ర విబేధాలు పొడచూపినట్లు తెలుస్తోంది. టిడిపి ఎంఎల్‌ఎలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో టిడిపి ఎంఎల్‌ఎలే ఏ దుకాణం ఎక్కడుండాలో నిర్ణయిస్తుండగా, జనసేన ఎంఎల్‌ఎలు ఉన్నచోట మాత్రం పట్టణం, గ్రామ పరిధి ఆధారంగా ఆ ప్రాంత టిడిపి, జనసేన నేతలు నిర్ణయిస్తున్నారు. తమ ఎంఎల్‌ఎ ఉన్న చోట తమ నిర్ణయం చెల్లనీయరా అని జనసేన శ్రేణులు ఆగ్రహం ప్రదర్శిస్తున్నారు.

దసరా, దీపావళి పండుగలతోపాటు రాష్ట్రంలో, జిల్లాలో పల్లె పండుగ పేరిట పెద్దఎత్తున అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ పనులన్నింటిలో ప్రధాన భాగం ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులదే. ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించే పనులు చేపట్టాల్సి ఉంది. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలోనూ కూలీలకు సంబంధం లేకుండా సిమెంట్ రోడ్లు నిర్మించారనే విమర్శలు వెల్లువెత్తాయి. అభివృద్ధి పనులే చేపట్టినా కూలీలకు ఉపాధి చూపేలా ఉంచాల్సిన బాధ్యత పాలకులదే. క్షేత్రస్థాయిలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ లక్ష్యానికి అనుగుణంగా పనులు సాగేలా చూడాలని కూలీలు కోరుతున్నారు. లేకపోతే సొమ్మొకరిది.. సోకొకరిది అనే చందంగా పరిస్థితి తయారవుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

నిత్యావసరాల ధరలు తగ్గించాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ఇరగవరం

నిత్యావసరాల ధరలు పెరిగిపోవడం వల్ల ప్రజలంతా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి అన్నారు. శనివారం మండలంలోని రేలంగి గ్రామంలో నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం భారాలు తగ్గిస్తామని అధికారంలోకొచ్చి సమస్యలు పరిష్కరించకపోగా, భారాలు తగ్గించకపోగా మరిన్ని భారాలు మోపడానికి సిద్ధపడటం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నేతలు ఇల్లింద్రపర్తి సత్యనారాయణ, తొంటా నాగబాబు, పి.సత్యనారాయణ, జన్ని మహాలక్ష్మి, జోగి సాయి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలని మహిళల ఆందోళన


ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలం ఆగర్రు పరిధిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని గోరింటాడకు చెందిన మహిళలు శనివారం ఆ మద్యం దుకాణం వద్ద ఆందోళన చేపట్టారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గోరింటాడ, ఆగర్రు గ్రామాలు పక్కపక్కనే ఆనుకుని ఉంటాయి. పంట బోదె సరిహద్దుగా ఉంటుంది. ఆ సరిహద్దు ప్రాంతంలోనే ఆగర్రు గ్రామ పరిధిలో మద్యం దుకాణం ఇటీవల ప్రారంభించారు. అయితే ఇది పక్కనే ఉన్న గోరింటాడలోని అమ్మవారి ఆలయానికి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అతి సమీపంలో ఉంది. పైగా నివాసాలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ గోరింటాకు చెందిన మహిళలు ఆందోళన చేపట్టారు. గుడిని, బడిని పక్కన పెట్టుకుని ఇలాంటి దారుణాలకు పాల్పడటం ఏమిటని స్థానిక మహిళలు నిలదీశారు. వెంటనే మద్యం దుకాణం తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి మండెల త్రిమూర్తులు, నరసింహారావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

త్వరలో డయాలసిస్ కేంద్రం

మంత్రి నిమ్మల రామానాయుడు


పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

గత ఎన్నికల్లో టిడిపి ఇచ్చిన హామీ మేరకు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని మరో 2 నెలల్లో ప్రారంభిస్తున్నట్లు జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి నూతన నిర్మాణాన్ని శనివారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 2019లో సిఎంగా ఉన్న చంద్రబాబునాయుడు ఆసుపత్రికి రూ.12.5 కోట్లు మంజూరు చేసినా తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నిర్మాణం పూర్తి చేయలేదని చెప్పారు. పైగా ఇష్టం వచ్చినట్లు కట్టారని, 4 నెలల కిందట తాము అధికారం చేపట్టాక నిర్మాణాన్ని సరి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 2 డయాలసిస్ కేంద్రాలు ప్రభుత్వం మంజూరు చేయగా పాలకొల్లులో ఒకటి ప్రారంభిస్తున్నామన్నారు. దీనివల్ల పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో వందలాది మంది రోగులకు ఉపయోగం ఉంటుందన్నారు. తొలుత 5 బెడ్‌లతో ప్రారంభించి రోగుల అవసరం బట్టి అది 10కి పెంచుతామని చెప్పారు. ఆసుపత్రి నిర్మాణానికి బోర్ నీరు ఇష్టం వచ్చినట్లు ఉపయోగించడం వల్ల భవిష్యత్తులో నిర్మాణం బీటలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు రవి కుమార్, వర్మ, సంతోష్ కుమార్, టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, పితాని వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు షూస్ అందజేత

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో కబడ్డీ క్రీడాకారులకు శనివారం టిడిపి గ్రామ అధ్యక్షులు కొనసపూడి సురేంద్ర కుమార్‌రాజు రూ.15 వేల విలువైన షూస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడారంగంలో కూడా రాణించాలన్నారు. వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో క్రీడాకారులకు షూస్ అందజేస్తున్నట్లు చెప్పారు. రాజ మహేంద్రవరం అంతర్ కళాశాలల్లో కబడ్డీ పోటీల్లో పాల్గొనున్న గణపవరం కళాశాల క్రీడాకారులు జీవన్, దలీప్ కుమార్ జగదీష్, గురుప్రసాద్, పవన్, గణేష్, సంజయ్‌కుమార్, సాయిదుర్గా, జగదీష్, సిద్దార్థలకు షూస్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వై.మధురాజు, లెక్చరర్లు సిహెచ్ చైతన్య, జి.వెంకటరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ పిఒ జి.వెంకటరమణ, పి.స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఉండి

మండల వ్యాప్తంగా నాలుగు రోజుల పాటు సాగే ఆధార్ ప్రత్యేక క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎస్.రవీంద్ర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ నాలుగు రోజులపాటు ఆధార్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, పాఠశాల, కళాశాల విద్యార్థులు ఆధార్‌లో నమోదైన పొరపాట్లను సరి చేయించుకోవాలని తెలిపారు. మండలంలో ఉండి, ఎన్ఆర్‌పి అగ్రహారం, వాండ్రం, మహదేవపట్నం తదితర సచివాలయాల్లో ఈ ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని, సంబంధిత అధికారులు విద్యార్థులు, ప్రజలకు ఆధార్ లోటుపాటు గూర్చి అవగాహన కల్పించాలని కోరారు.



కాళ్లకూరులో వర్షపు నీరు వెళ్లేలా పనులు చేస్తున్న దృశ్యం

వర్షపు నీరు వెళ్లేలా ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు మేజర్ పంచాయతీలో కాల్వలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రామాలయం, శివాలయం ప్రాంతాల్లో ఆర్అండ్‌బి రోడ్డుపై నీరు నిలిచిపోయింది. శనివారం కురిసిన చిన్నపాటి వర్షానికే నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో నడిచేందుకు, వాహనాలు వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు ఏర్పాటు చేయలేదు. దీంతో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తుండటం ఇటు పాదచారులు, అటు ప్రయాణికులు నరకం చూస్తున్నారు. మండల ఆర్అండ్‌బి ఎఇ కనుమూరి శ్రీహరి రాజు, గ్రామ సర్పంచి సాధ శ్రీదేవి శ్రీను, ఉపసర్పంచ్ నడింపల్లి ప్రదీప్‌రాజు, గ్రామ కార్యదర్శి, ... రాజు శనివారం రోడ్డు పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన వర్షపు నీరు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

వీరవాసరం :2024 - 25 విద్యా సంవత్సరానికి గాను ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. 8వ తరగతికి చెందిన 12 మంది విద్యార్థులకు పాఠశాల జూనియర్ అసిస్టెంట్ బోను దుర్గాప్రసాద్ ఆర్థిక సహకారంతో ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్ చేతులమీదుగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు బోను దుర్గాప్రసాద్ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఎన్ఎంఎంఎస్ టెస్టులో అర్హత సాధించి పాఠశాలకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రథమ సహాయకులు శివరావు వరప్రసాద్, స్టాఫ్ సెక్రటరీ జి.వెంకటేశ్వరరావు, సిహెచ్.ఫణికుమార్, ఎల్.రత్నరాజు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ఉండి: ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు శనివారం 1992-93 బ్యాచ్ విద్యార్థులు కాగిత శ్రీను, వేణుగోపాల్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, ఇల్లపు అప్పాజీ, ఉండ్రు ఐస్రాజు తదితరులు ఒక గ్రూప్‌గా ఏర్పడి సుమారు రూ.30 వేల విలువైన నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము పాఠశాలలో, తమకు విద్య నేర్పిన గురువుల మీద ప్రేమతో ఇక్కడే చదివే విద్యార్థులను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఏటా ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏలూరి రామలక్ష్మి మాట్లాడుతూ ఈ బ్యాచ్‌ను స్ఫూర్తి గా తీసుకోవాలని విద్యార్థులను సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాఠశాలలు అభివృద్ధి

పాలకొల్లు :దాతలు సహకరిస్తే ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేట్ స్కూల్స్ మాదిరిగా అభివృద్ధి చెందుతాయని ఎంఇఒ ఎ.డి.శర్మ చెప్పారు. జనసేన పట్టణ అధ్యక్షులు శిడగం సురేంద్ర ఆధ్వర్యంలో 28వ వార్డు వీవర్స్ కాలనీలో ఉన్న జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ స్కూల్లో హెచ్ఎం.భవానీప్రసాద్ రాయపూడి పిలుపుమేరకు విద్యార్థులకు ఐడి కార్డులు, పెన్నులు, పెన్సిల్ అందజేశారు. పట్టణ జనసేన ప్రధాన కార్యదర్శులు విస్సకోటి కృష్ణబాబు (గోపి), జనసేన ఉపాధ్యక్షులు అల్లవల్లి చందు సౌజన్యంతో స్కూలు పిల్లలకు వాటిని అందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కడలి పాపారావు, 28వ వార్డు జనసేన నాయకులు సంగిని హరీష్, యర్ర శేఖర్, ధనుసాయి పాల్గొన్నారు.

నూతన కల్లు పాలసీ తక్షణం ప్రకటించాలి

గీచేవానికే చెట్టుపై హక్కు కల్పించాలి

ఏపి కల్లుగీత కార్మిక సంఘం

పెనుగొండ: ఈ నెల ఒకటో తేదీన ప్రకటించాల్సిన నూతన కల్లు పాలసీ ఇప్పటికీ కూడా ప్రభుత్వం ఎందుకు ప్రకటించలేదని ఏపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. పెనుగొండ స్థానికంగా నిర్వహించిన కల్లుగీత కార్మికుల సమావేశానికి మామిడిశెట్టి నాగభూషణం అధ్యక్షత వహించారు. సమావేశంలో నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం మద్యం ఆదాయం కోసం ప్రకృతి సహజ సిద్ధమైన తాటికల్లును దెబ్బ తీస్తుందన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం అడగని వాగ్దానాలు చేసి గీత కార్మిక కుటుంబాల్లో ఆశలు కల్పించి గందరగోళం సృష్టించారని ధ్వజమెత్తారు. 2017లో ఇదే ప్రభుత్వం కిస్తీలు రద్దు చేసి గీత కార్మికులకు చెల్లిస్తా హామీ లేకుండా చేసి గీతవృత్తిని దారుణంగా దెబ్బతీసిందన్నారు. గత ప్రభుత్వం తాడిచెట్టు పై నుండి పడి మరణించిన, వికలాంగులైన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో ఇవ్వకుండా పాలకులు అన్యాయం చేశారన్నారు. పక్కనే ఉన్న తెలంగాణ ప్రభుత్వం గీత కార్మిక అభివృద్ధికి ఇస్తున్నట్లుగా ఎక్స్‌గ్రేషియో ఇవ్వడంతోపాటు వృత్తిలో మృతి చెందిన వారి కుటుంబానికి దహన సంస్కారాలకు రూ.30 వేలు, క్షతగాత్రులకు వైద్యానికి రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలను అన్ని జిల్లా కేంద్రాల్లో వెంటనే ఏర్పాటు చేయాలని, వృత్తిలో ప్రమాదాలు నివారించేందుకు గీత కార్మికులందరికీ సేఫ్టీ మోకులు ఇవ్వాలని, తాటికల్లును శీతల పానీయంగా అభివృద్ధి చేయాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తిని ఆధునికీకరించాలని, తక్షణం కల్లు పాలసీ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కట్టా నాగేశ్వరరావు, మామిడిశెట్టి వెంకటేశ్వరరావు, కట్టా రామకృష్ణ, కేతా ఏడుకొండలు, కట్టా వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

అధ్వానంగా శ్మశాన వాటిక..!

దహన సంస్కారాలకు సిద్ధాంతం వెళ్లాల్సిందే.. వాపోతున్న ప్రజలు.. పంచాయతీ వారు చొరవ చూపాలని వేడుకోలు

ప్రజాశక్తి - పెనుగొండ

పుట్టిన ప్రతి మనిషి గిట్టక తప్పదు. ఇది ప్రకృతి ధర్మం. మనిషి పుట్టిన తర్వాత సామాజిక స్థితిగతులను బట్టి మనిషి జీవన విధానంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నప్పటికీ శాశ్వతంగా విశ్రమించే శ్మశానంలో మాత్రం ఎలాంటి వ్యత్యాసం ఉండదు. కొందరు ఖననం చేస్తే, మరికొందరు దహనం చేస్తారు ఇవే తేడాలు. సుమారు 25 వేల జనాభా కలిగి ఉన్న పెనుగొండ మేజర్ పంచాయతీలో శ్మశానవాటిక పరిస్థితి చాలా అధ్వానంగా తయారైంది. ఆక్రమణలు పేరుకుపోయి దారికూడా కనపడక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎవరైనా చనిపోతే ఖననం చేయడానికి సరైన స్థలం లేక దారి పక్కనే పూడ్చే దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మనిషి చనిపోయాక మన ఊరిలోనే దహన సంస్కారాలు చేయమని చెప్పేవారు,



అధ్వానంగా ఉన్న శ్మశానవాటిక

కానీ ఇప్పుడు పెనుగొండలో మాత్రం ఆ పరిస్థితి లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం ఇక్కడ స్థానికులు సిద్ధాంతం వెళ్లి దహన సంస్కారాలు చేసుకోవలసి వస్తోందని వాపోతున్నారు. పల్లెటూరులో సహ అనేక ప్రాంతాల్లో రుద్రభూమి అతి సుందరంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ప్రస్తుతం పెనుగొండ శ్మశాన వాటికలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, లోపల చెట్లతో, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉన్నాయని, కూర్చుని పూజ చేసుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉందని శ్మశాన వాటికకు వచ్చిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పెనుగొండ పంచాయతీ వారు స్పందించి శ్మశాన వాటిక పరిస్థితులు చక్కదిద్దాలని, అధికారులు స్పందించి శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని ప్రజలు వేడుకొంటున్నారు.

21 నుంచి పోలీసు అమరవీరుల వారోత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పోలీసు శాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోలీసు అమరవీరుల వారోత్సవాల బ్రోచర్‌ను డిఎస్‌పి ఆర్‌జె.జయసూర్య శనివారం ఆవిష్కరించారు. బ్రోచర్ ఆవిష్కరించిన సిఐ జయసూర్య మాట్లాడుతూ పోలీసులు ప్రజారక్షణలో ప్రాణాలు సైతం కోల్పోతారు అనడానికి ఈ పోలీసుల అమరవీరుల వారోత్సవాలే నిదర్శనమని అన్నారు. రాష్ట్ర పోలీసుల ఉత్తర్వుల మేరకు ఎస్‌పి నేతృత్వంలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భీమవరంలో పలు స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు కూడా తమతో భాగస్వాములు కావడం ఆనందదాయకమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోలీసులకు ప్రజలు కూడా సహకరిస్తే మరింత ప్రతిష్టంగా భద్రత కల్పిస్తారని తెలిపారు. ఎస్‌పి నేతృత్వంలో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తామని, విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ముగింపు రోజున బహుమతులను అందజేస్తామని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా అవగాహనా ర్యాలీ కూడా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వన్ టౌన్, రెండో పట్టణ సిఐలు నాగరాజు, కాళీ చరణ్, ఎస్ఐలు పాల్గొన్నారు.



భీమవరం టౌన్ :వారోత్సవాల బ్రోచర్లను విడుదల చేస్తున్న పోలీసులు

సబ్‌జైల్‌లో జడ్జి సందర్శన

ప్రజాశక్తి - తణుకు

ఆర్థిక స్తోమత లేని వారికి మండల న్యాయ సేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తారని చైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. శనివారం తణుకు సబ్‌జైల్‌ను సందర్శించి రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న ఆహార, వసతి, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి సత్యవతి మాట్లాడుతూ శిక్షపడిన కేసుల్లో ముద్దాయిలకు కేసులు అప్పీల్ చేసుకొనేందుకు కూడా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తెలిసో తెలియకో చేసిన తప్పులను సరిద్దిదుకోవాలన్నారు. కార్యక్రమంలో జైలు విజిటింగ్ న్యాయవాది డి.కృష్ణకుమారి, సాధనాల వెంకటగిరి, సీనియర్ న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు, ప్యానెల్ న్యాయవాది ఎ.అజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - ఉండి

సహకార సంఘం ప్రతినిధులకు సమగ్ర వ్యవసాయంపై నిర్వహించే ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘ ప్రతినిధులకు 30 మందికి ఈ నెల 21వ తేదీ నుండి 15 రోజులు పాటు శిక్షణ తరగతులను నిర్వహించి వాటిపై పరీక్షలు ఏర్పాటు చేస్తామన్నారు. అందులో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.

శివరామరాజు మృతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

డిఎన్ఆర్ కళాశాల అసోసియేషన్ సహాయ కార్యదర్శి డిఎన్ఆర్ వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, సేవాతత్పరులు కొత్తపల్లి శివరామరాజు శనివారం మృతి చెందారు. తీవ్ర అస్వస్థతకు గురైన శివరామరాజు రెండు రోజుల క్రితం చికిత్స కోసం భీమవరంలోని ఓ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం శివరామరాజు కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంతాపం తెలిపిన వారిలో భీమవరం హాస్పిటల్స్ వైద్యులు గాదిరాజు గోపాలరాజు, డాక్టర్ సత్యనారాయణరాజు, డిఎన్ఆర్ కళాశాల అసోసియేషన్ అధ్యక్షులు నర్సింహరాజు, ఉపాధ్యక్షులు తదితరులు ఉన్నారు.

తహశీల్దార్ భారతీ విజయలక్ష్మికి సత్కారం

ప్రజాశక్తి - పాలకోడేరు



తహశీల్దార్‌ను సత్కరిస్తున్న సర్పంచి శివాజీరాజు, ఉద్యోగులు

పాలకోడేరు తహశీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎన్.భారతీ విజయలక్ష్మిని గొరగనమూడి సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు) శనివారం ఘనంగా సత్కరించారు. గొరగనమూడి సచివాలయంలో తహశీల్దార్ భారతీవిజయలక్ష్మికి సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి శివాజీరాజు మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలకు చక్కని పరిష్కారం చూపించి అందరి మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరళ, విఆర్‌ఒ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సత్యనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ గోపాల్, మహిళా పోలీస్ సౌమ్య, స్టిల్ అసిస్టెంట్ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

ముందుగానే పనులు పూర్తి చేస్తాం

ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

నిర్దేశించిన పనులను జనవరి 14వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఎంఎల్‌ఎ రఘు రామకృష్ణంరాజు అన్నారు. పల్లె పండుగలో భాగంగా శనివారం మండలంలోని దుంపగడప, సిద్ధాపురం, కళింగగూడెం గ్రామాల్లో డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణ పనులను ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులను ప్రభుత్వం నిర్దేశించిన సమయం కంటే ముందుగానే పూర్తి చేయాలని అభిప్రాయంతో ఉన్నామన్నారు. డిసెంబర్ నెలలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గొర్రెలకు వ్యాక్సిన్

ప్రజాశక్తి - నరసాపురం

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వ్యాక్సిన్లు తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్ధక వైద్యాధికారి ఐ.సురేంద్ర అన్నారు. శనివారం మండలంలోని సీతారామపురం గ్రామంలో 800 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 8 వేల గొర్రెలు, 3 వేల మేకలు ఉన్నాయని డాక్టర్ సురేంద్ర పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గొర్రెల కాపరులు వినియోగించుకోవాలని కోరారు. సోమవారం ఈ కార్యక్రమం వేములదీవిలో నిర్వహిస్తామన్నారు.

రోడ్ల నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలి నుంచి కోడేరు ఉత్తరపాలెం వరకూ రహదారి నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. కొడమంచిలి గ్రామ శాఖ మహాసభ ఇంజేటి వీరయ్య అధ్యక్షతన జరిగింది. తొలుత పార్టీ జెండాను కె.పోతురాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు మచ్చ సుబ్బారావు మూడేళ్ల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని, దోమల నివారణకు పంచాయతీ చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. మహాసభలో బండి రంగారావు, పమ్మి బాపిరాజు, ఎల్లమెల్లి కృష్ణమూర్తి, కారుపల్లి రాజు, కట్టా శేషయ్య పాల్గొన్నారు.

పెనుమంచిలి సంత మార్కెట్‌కు వర్ధనపు అప్పారావు పేరు పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. పెనుమంచిలి గ్రామంలో శనివారం సాయంత్రం సిపిఎం గ్రామ మహాసభ శాఖా కార్యదర్శి సిర్రా నరసింహమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో కేతా గోపాలన్ మాట్లాడుతూ వర్ధనపు గురువు నుంచి గౌండ్లగూడెం వరకూ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ఇసుక గురువు నుంచి కౌరుపాలెం వరకూ గ్రావెల్ రోడ్డు వేయాలని, డిమాండ్ చేశారు. అనంతరం శాఖ కార్యదర్శిగా సిర్రా నరసింహమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పెచ్చెట్టి వెంకట సత్యనారాయణ, ఎం.పెద్దిరాజు, ఎం.శ్రీరాములు, ఎం.వీర్రాజు, వి.కృష్ణమూర్తి, కొండేటి రాఘవులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్:అన్యాక్రాంతమైన ప్రభుత్వ అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంచాలని సిపిఎం బంగారుగూడెం గ్రామ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సిపిఎం గ్రామ మహాసభ శంకవరపు మహాలక్ష్మి అధ్యక్షతన బంగారుగూడెం గ్రామంలో జరిగింది. ఈ మహాసభకు పార్టీ మండల కన్వీనర్ పాలు పూరి సత్యనారాయణ, మండల నాయకులు కండెల్లి సోమరాజు హాజరయ్యారు. మండల కన్వీనర్ పాలకూరి సత్యనారాయణ మాట్లాడుతూ బంగారుగూడెం. వీరంపాలెం గ్రామాల్లో అసైన్డ్ భూమి అన్యాక్రాంతమై భూస్వాములు, ధనిక రైతులు చేతుల్లో ఉందని తెలిపారు. ప్రభుత్వం దీనిపై దర్యాప్తు జరిపి అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంచాలని వారు డిమాండ్ చేశారు. మండల నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడారు. మహాసభలో మూడేళ్ల నివేదికను శాఖ కార్యదర్శి సిద్ధాబత్తుల నాగేశ్వరరావు ప్రవేశపెట్టగా సభ్యులు చర్చించి ఆమోదించారు. నూతన కార్యదర్శిగా సిద్దాబత్తుల నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎ.వెంకటేశ్వరరావు, గుమ్మడి కేశవు పాల్గొన్నారు.

గ్రామ సభలు భూ సమస్యల పరిష్కార వేదికలు

ప్రజాశక్తి - పాలకోడేరు

రీ సర్వే గ్రామ సభలు భూ సమస్యల పరిష్కారానికి వేదికని తహశీల్దార్ ఎం.భారతీ విజయలక్ష్మి అన్నారు. గొరగనమూడి సచివాలయంలో రీసర్వేపై గ్రామ సభ శనివారం సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు రాజు (శివాజీ రాజు) అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభ ప్రాముఖ్యతను రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజు రైతులకు, భూ యజమానులకు అవగాహన కల్పించారు. అనంతరం తహశీల్దార్ భారతి విజయలక్ష్మి మాట్లాడారు. ప్రతి గ్రామంలో గ్రామ సభల ద్వారా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. భూ యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచి శివాజీ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిఐఒఎస్ మల్లికార్జునరావు, మండల సర్వేయర్ శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శి సరళ, గ్రామ రెవెన్యూ అధికారి పాల్గొన్నారు.

ఉండి:గ్రామస్థాయిలో భూ సమస్యలను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన భూముల రీ సర్వే తప్పులతడకగా మారిందని చిన్నపుల్లేరు గ్రామానికి చెందిన పలువురు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. శనివారం చిన్నపుల్లేరు, పెదపుల్లేరు గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో పాల్గొన్న తహశీల్దార్ కావడి నాగార్జున దృష్టికి చినపుల్లేరు గ్రామస్తులు రీ సర్వేపై పలు సమస్యలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ భూములకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే గ్రామసభ దృష్టికి తీసుకురావాలన్నారు. చినపుల్లేరులో 33 మంది దరఖాస్తు చేయగా, పెదపుల్లేరులో సుమారు 20 అర్జీలు వచ్చాయని, వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో చినపుల్లేరు సర్పంచి పెన్మెత్స సావిత్రమ్మ, ఉప సర్పంచి బొర్రా సువర్ణరాజు, పెదపుల్లేరు సర్పంచి రణం పార్వతి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని దినాలు కల్పించడమే ధ్యేయంగా గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని ఉపాధి హామీ చట్టం టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఓమేగా రాజు అన్నారు. మండలంలోని చిలుకూరు మహదేవపట్నం గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పనుల అంచనాలపై రెండో దఫా గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని, ఉపాధి పనులతోనే గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

నరసాపురం : భూ సమస్యలను పరిష్కరించి రైతులకు మేలు చేసేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి అన్నారు. చిట్టవరం రైతు సేవా కేంద్రం వద్ద శనివారం గ్రామ సర్పంచి తాడి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ఆమె రైతులనుద్దేశించి మాట్లాడారు. సమావేశంలో ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ, విఆర్ఒ ఎం.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎల్‌విఎన్.పురం విఆర్ఒ మృతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మండలంలోని ఎల్‌విఎన్.పురం విఆర్ఒ సుబ్బారావు (బాబి) శనివారం గుండెపోటుతో విధులు నిర్వహిస్తూ తన కార్యాలయంలో మృతి చెందారు. సుబ్బారావుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భీమవరం మున్సిపాల్టీలోని 35వ వార్డు నుంచి ఎల్‌విఎన్.పురం గ్రామానికి బదిలీపై వెళ్లారు. ఆయన మృతికి భీమవరం తహశీల్దార్, విఆర్ఒలు సంతాపం తెలిపారు.

అద్దేపల్లి జీవితం స్ఫూర్తిదాయకం: మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

అద్దేపల్లి సత్యనారాయణమూర్తి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అద్దేపల్లి 125 జయంతి వేడుకలు శనివారం స్థానిక ఛాంబర్ కామర్స్ కళాశాలలో నిర్వహించారు. తొలుత మంత్రి నిమ్మల జ్యోతి ప్రజ్వలన చేసి అద్దేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా పలువురు యువకులు రక్తదానం చేశారు. సభలో మంత్రి మాట్లాడుతూ పాలకొల్లులో ఆనాడు కళాశాలల ఏర్పాటుకు డబ్బులు సమకూరకపోతే సొంత రైస్ మిల్లును అమ్మి కళాశాలను ఏర్పాటు చేసిన విద్యాదాత అద్దేపల్లి అని కొనియాడారు.

నిబంధనల మేరకే బాణసంచా దుకాణాలు మంజూరు

ఆర్‌డిఒ దాసి రాజు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వ నిబంధనల మేరకే బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తామని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. సరిపల్లి శివారు చినమామిడిపల్లి కాలనీ సమీపంలోని లేఅవుట్లో ఏర్పాటు చేస్తున్న దీపావళి సామగ్రి దుకాణ ప్రాంతాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఇన్‌ఛార్జి ఆర్ఐ సరిపల్లి విఆర్ఒ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 23న మెగా రక్తదాన శిబిరం, పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు జబర్దస్త్ ప్రకాష్, ప్రసన్న సాహో తెలిపారు. భీమవరం మార్కెట్ యార్డులో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొంతమంది ఈ కార్యక్రమాలపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాతావరణ ఇబ్బందుల కారణంగా సెలబ్రెటీ వినోద కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నామని, త్వరలోనే సెలబ్రెటీ షో తేదీని ప్రకటిస్తామని అన్నారు. విమర్శలు చేయడం సరికాదని, ఈవెంట్ పేరుతో వసూళ్లు చేస్తున్నామని కొంతమంది విమర్శలు చేస్తున్నారని అన్నారు. భీమవరం ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షులు అజయ్ వర్మ మాట్లాడుతూ వ్యక్తిగత విమర్శలు వద్దని, ఇటువంటి విమర్శలతో ప్రభాస్ పేరును పాడు చేయొద్దని కోరుతున్నట్లు తెలిపారు.

మొగల్తూరు : రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజు వేడుకలను ఈనెల 23వ తేదీన ఘనంగా నిర్వహించనున్నామని ప్రభాస్ అభిమానుల సంఘ జిల్లా కన్వీనర్ చింతపల్లి రవికుమార్ శనివారం తెలిపారు. ఈ మేరకు మొగల్తూరులోని రామాలయం వీధిలో ఉన్న టిఆర్‌కెకార్ బజార్ వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నామని తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ఉచిత డిఎస్‌సి కోచింగ్

ప్రజాశక్తి - నరసాపురం

బిఇడి పూర్తిచేసి టెట్‌లో అర్హత పొందిన ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ డిఎస్‌సి కోచింగ్ ఇస్తామని నరసాపురం సహాయ సాంఘిక సంక్షేమ శాఖాధికారి బాలు సాధన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వైఎన్ కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావును కలిసి కళాశాలలోని బిఇడి విద్యార్థులకు ఈ విషయాన్ని తెలియాలని తెలిపారు. నరసాపురం పరిసర ప్రాంతాల విద్యార్థులందరూ ఎక్కువ సంఖ్యలో ఈ నెల 21వ తేదీ లోపులో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, 27న జరగబోవు అర్హత పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక జరుగునని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డీన్ గంధం రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకట రత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

23న వి.వి.గిరిలో ఉద్యోగ మేళా

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని దుంపగడప వి.వి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రణాళిక అభివృద్ధి విభాగం కార్యదర్శి డాక్టర్ పి.బలరాం ప్రతాప్ కుమార్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జాతీయ కెరియర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఈ ప్లేస్మెంట్ డ్రైవ్ కళాశాలలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. స్టాఫింగ్ టైటాన్స్, ముత్తూట్ ఫైనాన్స్, పేటీఎం వంటి అనేక ప్రతిష్టాత్మక కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు జిడి.శ్రీనివాస్ 8688594244ను సంప్రదించాలని సూచించారు.

117 జిఒ రద్దుపై హర్షం

ప్రజాశక్తి - తణుకు

పాఠశాల విద్యాశాఖలో తీవ్ర అభ్యంతరకరమైన జిఒ 117ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం పట్ల ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జిఒ 117 వల్ల ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి ఒక్క ఉపాధ్యాయ పాఠశాలలుగా, చాలా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు పాఠశాలల్లో చేరకపోవడం వల్ల మూతపడిపోయాయని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలలకు రప్పిస్తే విద్యార్థులకు మరింత న్యాయం జరిగి, ప్రాథమిక పాఠశాలలు బలోపేతం అవుతాయని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో కూడా గతంలో టిడిపి ప్రభుత్వం అమలు చేసిన సక్సెస్ స్కూల్స్ (తెలుగు, ఇంగ్లీషు మీడియం) విధానాన్ని పునరుద్ధరించాలని రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గ్రామపంచాయతీ కార్యాలయము, ఆగిరిపల్లి

రి.క. నెం.44/2024 **బహిరంగ వేలం ప్రకటన** తేది.18-10-2024

ఆగిరిపల్లి మండలం, ఆగిరిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా ఐటమ్ లకు చేపల పలసాయం పొందుటకు బహిరంగ వేలం నిర్వహించుటకు పై అధికారుల ఉత్తర్వుల ననుసరించి ది. 25-10-2024వ తేది శుక్రవారం ఉదయం 11.00 గంIIలకు ఆగిరిపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయము వద్ద సదరు పంచాయితీ కార్యదర్శి గారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలం వేయబడును. బహిరంగ వేలం నందు పాల్గొనదలచిన వారు సంబందిత తహసీల్దారు వారి వద్ద నుండి పొందిన రూ. 30,00,000/- లకు సాల్వేన్సి ధృవీకరణ మరియు షెడ్యూల్ నందు తెలిపిన ధరావతులు చెల్లించి హెచ్చు పాట మొత్తము ఏక మొత్తము లో వెంటనే చెల్లించు విధానము ననుసరించి బహిరంగ వేలం పాటలలో పాల్గొనవలయును. వేలం షరతులు మరియు ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు తెలిసికొనవచ్చును.

వరుస నెం	అయిటమ్ వివరము	చెల్లించవలసిన ధరావత్తు	పాట కాలపరిమితి
1	కురివిడి చెరువు	10000/-	2024-2026
2	ఫీడరు చెరువు	10000/-	2024-2026

సం/- పంచాయతి కార్యదర్శి
గ్రామపంచాయతి ఆగిరిపల్లి